# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి: వేముల మారయ్య






**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో (సాంబ పస్తం) ఫిబ్రవరి 8:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని బి ఆర్ టి యు ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య పిలుపునిచ్చారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ముద్రించిన సమ్మె పోస్టర్లను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాప్రా డివిజన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎన్. మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు బోడుప్పల్‌లో విద్యుత్ నిలిపివేత

### - బోడుప్పల్ ఆపరేషన్ ఏఈ ఎన్.వేణుగోపాల్




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పస్తం సైదులు),ఫిబ్రవరి8:** బోడుప్పల్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని పలు కాలనీల్లో నేడు (ఫిబ్రవరి 9) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని బోడుప్పల్ ఆపరేషన్ ఏఈ ఎన్. వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో వార్షిక నిర్వహణ పనులు (పిఎంఐ),లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల నరికివేత పనుల కారణంగా ఈ క్రింది ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని ఆయన పేర్కొన్నారు. **ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు:** 33/11కేవీ ఇందిరా నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎస్బి ఆర్ కాలనీ ఫీడర్ ద్వారా విద్యుత్ పొందే పద్మావతి కాలనీ,అమ్మసాని వెంకట్ రెడ్డి కాలనీ,ఆర్ఎన్ఎస్ కాలనీ,ఎస్బిఆర్ కాలనీ, బిఎల్ నగర్,అంజయ్య ఎన్‌క్లేవ్, టెలిఫోన్ కాలనీ ఫేజ్-2,పిఎన్ఆర్ కాలనీ, రెడ్డి కాలనీ,భవానీ కాలనీ,శుభోదయ కాలనీ,లెక్చరర్స్ కాలనీ, గ్రీన్ సిటీ నగర్,అంగపురి కాలనీ,భీమ్ రెడ్డి కాలనీ, ఎన్ఐఎన్ కాలనీల్లో సరఫరా ఉండదు. **మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5వరకు:** 33/11 కేవీ బోడుప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇందిరా నగర్ ఫీడర్ కిందకు వచ్చే సాయి భవానీ నగర్, సాయి రామ్ కాలనీ, శ్రీనివాస కాలనీ, ఈస్ట్ బృందావన్ కాలనీ, భవానీ నగర్, ఆర్బిఎం హాస్పిటల్ మెయిన్ రోడ్, వెస్ట్ హనుమాన్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

# విహారయాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

### • తొర్రూర్ డిపో మేనేజర్ పద్మావతి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఫిబ్రవరి 8:** ప్రజల వినోదం,ఆధ్యాత్మిక అవసరాల కోసం ఈ నెలలో తొర్రూర్ డిపో నుండి గోవా, శ్రీశైలం క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పద్మావతి తెలిపారు. ఆదివారం డిపో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. **14న గోవా యాత్ర:** పర్యాటక ప్రియుల కోసమే ప్రత్యేకంగా గోవా టూర్ ప్యాకేజీని రూపొందించాం. ఈ నెల 14వ తేదీ ఉదయం తొర్రూర్ నుండి బస్సు బయలుదేరుతుంది. ఈ ప్రయాణంలో భక్తులు మూర్డేశ్వర్, గోకర్ణ క్షేత్రాలను సందర్శించుకోవచ్చు. అనంతరం గోవాలోని ప్రసిద్ధ కళంగాట్, బాగా బీచ్‌లను సందర్శించేలా ప్రణాళిక సిద్ధం చేశాం. పర్యటన ముగించుకుని 17వ తేదీన బస్సు తిరిగి తొర్రూర్ చేరుకుంటుంది. ఈ యాత్రకు టికెట్ ధర ఒక్కొక్కరికి రూ.6వేలు గా నిర్ణయించాం అని డీఎం వివరించారు. **శివరాత్రికి శ్రీశైలం సర్వీస్:** అలాగే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనార్థం సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నాం. ఇది కూడా 14వ తేదీనే బయలుదేరి, స్వామివారి దర్శనం తర్వాత 15న తిరిగి చేరుకుంటుంది. దీనికి పెద్దలకు రూ.1,500, పిల్లలకు రూ.900 ఛార్జీ ఉంటుంది. భక్తులు, పర్యాటకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి అని ఆమె కోరారు. **సంప్రదించాల్సిన నంబర్లు:** టికెట్ల బుకింగ్,ఇతర సమాచారం కోసం 9959226053, 7032182456 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పద్మావతి సూచించారు.

# కాంగ్రెస్‌తోనే మున్సిపాలిటీల అభివృద్ధి

### - అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి

### - గడప గడప ప్రచారంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

### - అజీజ్ నగర్,దేవుని ఎర్రవెల్లిలో జోరుగా ఎన్నికల ప్రచారం





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఫిబ్రవరి8:** పట్టణాల సమగ్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్ (5,7,8 వార్డులు)లో వారు విస్తృతంగా పర్యటించారు. గడప గడపకూ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దే అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు. అజీజ్ నగర్ వార్డు అభ్యర్థులు అమరేందర్ రెడ్డి, యాదగిరి, నరేందర్ గౌడ్లను 'చేయి' గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. **ఎర్రవెల్లిలో రంజిత్ రెడ్డి ప్రచారం:** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దేవుని ఎర్రవెల్లిలో మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వినోద చంద్రయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. నియోజకవర్గ ఇంచార్జ్ భీమ్ భరత్, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు పాల్గొని ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఫహీం, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణ రెడ్డి, మండల అధ్యక్షుడు మానయ్య, రవీందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, గణేష్ గౌడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.